క్లుప్తంగా

కుశస్థలి నదికి నీటి విడుదల



కృష్ణాపురం జలాశయం గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

కార్వేటినగరం: ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులపాటు కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణాపురం జలాశయం పూర్తి స్థాయిలో నిండిందని ఏఈలు భాస్కర్‌రాజు, రవిప్రకాష్ తెలిపారు. సోమవారం జలాశయం కార్యాలయం వద్ద విలేకరులతో ఏఈలు మాట్లాడారు. ఎగువ ప్రాంతాల నుంచి నీరు జలాశయానికి చేరుతుండడంతో నీటి మట్టం పెరిగిందన్నారు. జలాశయం సామర్థ్యాన్ని బట్టి గేట్ల ద్వారా సోమవారం రాత్రి నీటిని విడుదల చేస్తామన్నారు. దీంతో కుశస్థలి పరివాహక ప్రాంతాల్లో పశువుల కాపరులు, రైతులు, విద్యార్థులు నదిని దాటేందుకు సాహసించకూడదని సూచించారు. ముందస్తు హెచ్చరికల్లో భాగంగా రెవెన్యూ సిబ్బంది దండోరా వేసినట్టు పేర్కొన్నారు. జలాశయం వద్ద ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని, సందర్శకులు రాకుండా చూస్తున్నామని చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి



విజయమాంబాపురం ఎస్టీ కాలనీని సందర్శిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం: తుపానుపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల పరిధిలోని విజయమాంబాపురం ఎస్టీ కాలనీని ఎంపీడీఓ చంద్రమౌళి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిందన్నారు. నీళ్లు చేరిన ఇళ్లలోనివారు ప్రభుత్వ భవనాలకు చేరుకోవాలని, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మండలంలోని జగన్నాథపురంలో గత 50 సంవత్సరాల క్రితం నిర్మించిన పక్కా గృహాలు దుస్థితికి చేరుకున్నాయని, వారికి కూడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. మరో రెండు రోజులపాటు అల్పపీడనం ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోందని, దీని దృష్టిలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. విజయమాంబాపురం ఎస్టీ కాలనీలో దుస్థితికి చేరుకున్న ఇళ్లను గుర్తించి, వారికి పునరావాసం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వెంట సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



బాలాజీ (ఫైల్)

పుత్తూరు: తడుకు పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కె.బాలాజీ(51) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. గత పాతికేళ్లుగా వైఎస్సార్ సీపీ నాయకుడిగా కొనసాగిన ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి అందులో కొనసాగుతున్నారు. ఈయన తల్లి సుశీలమ్మ తడుకు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. తడుకు పంచాయతీ ప్రజలకు తల్లో నాలుకగా పనిచేసిన ఈయన మృతిపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగిన వర్షాలు



పిడతలకోన చెరువు తూము లీకేజీ సరిచేసే పనుల్లో అధికారులు

వడమాలపేట(విజయపురం): ఫెంగల్ ఎఫెక్ట్ సోమవారం కూడా కొనసాగింది. విరామమిస్తూ హోరువర్షం కురిసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కాలువల్లో నీటిప్రవాహం పెరిగింది. బంగారెడ్డి కండ్రిగ గ్రామ పంచాయతీ, పిడతల కోన చెరువు తూము లీకేజీ కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులకు సమాచారం అందించడంతో పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ ఏఈ, గ్రామ పంచాయతీలోని ప్రజాప్రతినిధులు ఇసుక బస్తాలు వేసి తూము లీకేజీ అరికట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం సాయంత్రం అమ్మపల్లిలోని ఎన్టీఆర్ జలాశయం గేట్లు తెరవబోతున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించడంతో గ్రామప్రజలు ఎవరు సాయంత్రం తర్వాత నదిలోకి దిగవద్దని, అలాగే చిన్నపిల్లలు కూడా ఎవరూ నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు.



నగరి బాలాజీ గోల్డెన్ సిటీలో నేలకొరిగిన చెట్టు

భవితకు లేదు భరోసా

ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించి, వారికి మేమున్నామనే భరోసా కల్పించేందుకు భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం ఆ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోంది. శారీరకంగా, మానసికంగా అవస్థలు పడుతున్న ఎంతోమంది చిన్నారులకు ఉపకరణాలు, శిబిరాల సేవల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. మరీ ముఖ్యంగా ఫిజియోథెరపీ వైద్యుల కొరత కేంద్రాలను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఆయా కేంద్రాల్లో చేపట్టాల్సిన నెలవారీ కార్యక్రమాలు, యాక్షన్ ప్లాన్ సరిగా అమలు కావడంలేదు. భవిత కేంద్రాల్లో ఆశించిన ఫలితాల్లేవన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. – పాలసముద్రం

- భవిత కేంద్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఉపకరణాల కోసం చిన్నారుల ఎదురు చూపు
- ప్రత్యేక శిబిరాల్లో పాల్గొన్నా అందని పరికరాలు
- వేధిస్తోన్న ఫిజియోథెరపీ వైద్యుల కొరత
- కనిపించని ప్రత్యేక శిబిరాల నిర్వహణ
- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



వినికిడి యంత్రం పంపిణీ(ఫైల్)

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో భవిత కేంద్రాల్లో 85 మందికి పైగా చిన్నారులు ఉన్నారు. వారిలో ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి, భవిత కేంద్రంలోనే విద్యనందిస్తున్నారు. మానసిక వైకల్యం, వినికిడి లోపం, ఆటిజం, దృష్టి లోపంతో బాధపడే వారికి కేంద్రంలోనే ఫిజియోథెరపీ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే నాలుగు మండలాలకు ఒక్కరే ఫిజియోథెరపీ వైద్యుడు ఉన్నారు. దీంతో వారానికి ఒకరోజు మాత్రమే వచ్చి ఫిజియోథెరపీ అందించాల్సిన పరిస్థితి. దీంతో కేంద్రాల్లోని పిల్లలకు సక్రమంగా ఫిజియోథెరపీ సేవలందడం లేదు. పదేళ్ల క్రితం అందజేసిన పరికరాలే భవిత కేంద్రాల్లో ఉన్నాయి. ఇప్పుడు బాగా పాడైపోవడంతో వాటితోనే సేవలందిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ఐఈఆర్‌టీలుగా పనిచేస్తున్న వారే పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలతోపాటు నడవడిక నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పిల్లలతో తల్లిదండ్రులు అనుసరించాల్సి ప్రత్యేక శ్రద్ధపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

తప్పని ఎదురు చూపులు

ప్రత్యేకావసరాల పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఉపకరణాలు అందించాలి. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, దివ్యాంగుల అవసరాన్ని గుర్తించాలి. ఎవరికి ఏ పరికరం అవసరమో అందించాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ప్రత్యేకావసరాల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందించేవారు. మండలంలో నుంచి 18 ఏళ్ల వయసులోపు వారిని 35 మందిగా గుర్తించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గతంలో గుర్తించిన వారికి ఉపకరణాలు, ఫిజియోథెరపీ సేవలు అందించాల్సి ఉంది. అయితే వారిని ప్రస్తుత చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, తక్షణమే ఉపకరణాలు అందజేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు (ఫైల్)

నివేదిక పంపించాం



భవిత కేంద్రంలోని ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో వివిధ లోపాలతో బాధపడుతున్న వారికి ఉపకరణాలు అందించకపోవడం వాస్తవమే. వారికి అందజేయాల్సిన ఉపకరణాల కోసం ఆలెమ్కో కాన్పూర్ వారికి నివేదిక పంపిచాం. అవి వచ్చిన వెంటనే అందిస్తాం.

– రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నగరి: 65వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నగరి దివ్యాంగుల యూనిట్ అధ్యక్షుడు కేశవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఈ వేడుకలకు హాజరు కావాలని కోరారు.

4న చెరివిలో విద్యుత్ లోక్ అదాలత్

సత్యవేడు: శ్రీసిటీలోని చెరివి ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 4న విప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నాగలాపురం ఏడీఏ రమేష్ విలేకరులకు తెలిపారు. బుధవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమాన్ని విద్యుత్ లోక్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన నిర్వహించనున్నామని, పుత్తూరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని వడమాలపేట, రాయలచెరువు, పుత్తూరు, పుత్తూరు రూరల్, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, చెరివి ట్రాన్స్‌కో సెక్షన్ల సంబంధించిన విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాతపూర్వకంగా అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామన్నారు. అదాలత్‌లో ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక నిపుణులు ఎస్ఎల్ అంజన్ కుమార్ పాల్గొంటారని, దీనిని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

నగరి: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి తగ్గలేదని, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని సోమవారం కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి కేవలం నెమ్మదించిందని పూర్తిగా నిర్మూలన కాలేదన్నారు. ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలు, మార్గాలపై యువత అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని, ప్రధానంగా ఇది లైంగిక సంబంధాల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ కో–ఆర్డినేటర్ ఇందిరప్రియదర్శిని, రెడ్‌రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ జి.స్వాతి, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ భాస్కర్ రాజు, అధ్యాపకులు సుబ్రమణ్యం, వరలక్ష్మి, చిన పాపమ్మ, సుహాసిని, పంకజ, రేవతి, ఉమామహేశ్వరి, జ్యోతి, హరికృష్ణ, కిరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

నగరి: ఫెంగల్ తుపాను ప్రభావం సోమవారం కూడా కొనసాగింది. వరుస వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పలు చెరువులు పూర్తిగా నిండాయి. పలు చెరువులు సగానికిపైగా నీటితో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా నగరి మండలంలో 34 చిన్న నీటిపారుదల చెరువులు ఉండగా 16 చెరువులు పూర్తిగా నిండాయి. 10 చెరువులు 75 శాతం పైగా నిండగా 8 చెరువులు 50 శాతం నీటితో దర్శనమిస్తున్నాయి. ఈ చెరువులపై ఆధారపడి 3005 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. విజయపురం మండలంలో 40 చిన్న నీటిపారుదల చెరువులు ఉండగా వాటిలో 20 చెరువులు పూర్తి నిండింది. 13 చెరువులు 75 శాతం, 7 చెరువులు 50 శాతం నీరు నిండి ఉన్నాయి. ఈ చెరువులపై ఆధారపడి 3340 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. నింద్ర మండలంలో 42 చిన్ననీటిపారుదల చెరువులు ఉండగా 12 చెరువులు పూర్తిగా నిండింది. 21 చెరువులు 75 శాతం, 9 చెరువులు 50 శాతం నీటితో దర్శనమిస్తున్నాయి. ఈ చెరువులపై ఆధారపడి 3216 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. పుత్తూరు మండల పరిధిలో 31 చెరువులు ఉండగా వాటిలో 20 చెరువులు పూర్తిగా నిండి ఉంది. 11 చెరువుల్లో 50 శాతం పైగా నీరు నిండింది. ఈ చెరువులపై ఆధారపడి 2880 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. వడమాలపేట మండలంలో 25 చెరువులు ఉండగా 20 చెరువులు పూర్తిగా నిండింది ఐదు చెరువులు 75 శాతం నిండాయి. వీటిపై ఆధారపడి 2216.24 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. చెరువుల్లో నీరు చేరడంతో వ్యవసాయానికి నీరు ఎంతో ఉపయోగకరంగా ఉండడంమే కాక వ్యవసాయ బోర్లు, బావుల్లో నీటి సామర్థ్యం పెరుగుతుందని రైతులు అంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోబుగ్గ అగ్రహారం వద్ద కుశస్థలి నదిపై రూ.36 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు 25 చెరువులకు నీరు చేరేందుకు ఉపయోగపడింది.



నగరి ముడిపల్లి చెరువు



నగరి మిట్టపాళెం చెరువు



కలుజు పారుతున్న నగరి మాంగాడు చెరువు



నగరి గుండ్రాజుకుప్పం చెరువు

కన్నుల పండువగా లక్ష దీపోత్సవం

పుత్తూరు: తమిళ కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు 365 వత్తులతో జ్యోతి ప్రజ్వలన చేశారు. దీంతో ఆలయ పరిసరాలు దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందింది.



ఈశ్వరాలయంలో లక్ష దీపోత్సవం

నీట మునిగిన పంటలు

మండలంలో గత మూడు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, ఉద్దులు, పెసలు తదితర పంటలు సాగులో ఉన్నాయి. వర్షా కారణంగా పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతుల పంటలు పూర్తిగా మునిగి పోయాయి. ప్రభుత్వం అదుకోవాలని కోరుతున్నారు.

- ఆవేదనలో రైతులు



అత్తూరులో ఉద్దుల పంటలో వర్షపునీరు



నింద్రలో వరి పంటలో నీరు

నింద్ర: మండలంలో రబీ సీజన్‌లో మాత్రమే అధికంగా వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తారు. ఆరుతడి పంటలుగా ఉద్దులు, పెసలు సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం అధికంగా వరి, ఆరు తడి పంటలుగా వేరుశనగ, ఉద్దులు సాగు చేశారు. సాగు చేసిన 20 రోజులకే తుపాను రావడంతో పంట పొలాలు నీటిలో మునిగి పోయాయి. అధికంగా నీరు చేరడంతో వరి మళ్లు కుళ్లి పోయే ప్రమాదం ఉంది. అదే విధంగా వేరుశనగ విత్తనాలు కూడా భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మండలంలో మొత్తం 165 హెక్టార్లలో వేరి సాగు చేశారు. వేరుశనగ 50 హెక్టార్‌లు, ఉద్దులు 40 హెక్టార్‌లు, పెసలు 30 హెక్టార్లలో సాగు చేశారు. వరి పంటలో నీరు చేరినప్పటికీ సమస్య ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేరుశనగ, మిగిలిన పంటలకు నష్టం ఉంటుందని తెలిపారు. మండలంలోని అత్తూరు గ్రామంలో అధిక శాతం ఉద్దులు పంట సాగు చేశారు. గతంలో కూడా ఆ గ్రామ రైతులు ఉద్దులు పంట అధికంగా సాగు చేసేవారు. అగరం, ఎలకాటూరు, ఇరుగువాయి, కావునూరు గ్రామాల్లో వేరుశనగ పంటలో వర్షపు నీరు చేరింది.



అగరం గ్రామంలో వేరుశనగ పంటలో నీరు

పంట నష్టం జరిగింది



తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నాకున్న మూడు ఎకరాల్లో ఉద్దుల పంటలో నీరు చేరింది. ప్రతిరోజు నీరు తీసినా తిరిగి వర్షం పడుతోంది. ఇక పంట పోయినట్టే. పంట కోసం 30 వేల రూపాయలు ఖర్చు చేశాను. వర్షాలకు పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– రమేష్, రైతు, అత్తూరు

నష్టపరిహారం అందించాలి



మండలంలో తుపాను కారణంగా పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. నాకున్న పొలంలో వేరుశనగ, ఉద్దులు సాగు చేశాను. వర్షానికి పూర్తిగా పొలంలో నీరు చేరడంతో పంట నష్టం తప్పడం లేదు. పెట్టుబడి కోసం అప్పు చేసి పంట సాగు చేశాను.

– ఎయుమలై, రైతు, అత్తూరు

నష్టం తప్పదు



రైతులు సాగు చేసిన పంటలు నీట మునిగి పోవడంతో రైతులకు తీవ్ర నష్టం తప్పదు. పంటసాగు కోసం రైతుల కష్టాలను గుర్తించి ఆదుకోవాలి. నేను వేరుశనగ పంట సాగు చేశారు. విత్తనాలు మొల కెత్తే సమయంలో వర్షాలు రావడంతో పూర్తిగా నీరు చేరింది. నాలాంటి ప్రతి రైతుకు నష్టం త ప్పడం లేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– వరదయ్య, రైతు, ఓబీఆర్ పురం

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

నగరి: టీఆర్ కండ్రిగలోని శిరిడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్టు వారు నిత్యావసర సరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. సోమవారం ట్రస్టు ఫౌండర్ మోహన లక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ ఇ.ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు సరుకులు, దుప్పట్లను అందించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, వర్షాకాలం చలికి ఇబ్బంది పడకుండా అందరికీ దుప్పట్లు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల నిర్వాహకులు ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



నిత్యావసర సరుకులు, దుప్పట్లతో విద్యార్థులు, దాతలు

నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రీరంగరాజపురం: మండలంలోని పాత పాళ్యం దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్నే ధ్వంసం చేయడం నీచమైన చర్య అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువైందని అన్నారు. పోలీసులు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేయాలన్నారు. ధ్వంసం చేసిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

పొంగిన వాగులు

పాలసముద్రం: ఫెంగల్ తుపానుతో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని వాగులు, వంకలు, చెరువు మొరవలు, చెక్‌డ్యామ్‌లు పొంగి పొర్లుతున్నాయి. ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు మండలంలో 100 ఎకరాలకుపైగా వరిపంట నేలపాలైంది. నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. కురిసిన వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. చెరువులు మొరవ పోతున్నాయి.



మొరవపోతున్న వెంగళరాజుకుప్పం చెరువు